అభివృద్ధికి చిరునామా రంగన్నగూడెం

- గత ఐదేళ్లలో రూ.4.07 కోట్ల అభివృద్ధి పనులు
- కోటి రూపాయలతో ప్రభుత్వ కార్యాలయాలు
- వీరవల్లి - సింగన్నగూడెం రోడ్డు రూ.1.90 కోట్లతో అభివృద్ధి
- డీబీటీ ద్వారా రూ.15.70 కోట్ల లబ్ధి

హనుమాన్‌జంక్షన్ రూరల్: దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన బాపులపాడు మండలంలోని రంగన్నగూడెం గ్రామ ముఖచిత్రం ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో పూర్తిగా మారిపోయింది. గ్రామంలో అడుగడుగునా అభివృద్ధి ఆనవాళ్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరుకు దర్పణాలుగా నిలుస్తున్నాయి. ఊరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్కు అభివృద్ధి జాడలు నిలువెత్తు సాక్ష్యాలుగా కనబడుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రంగన్నగూడెంలో రూ.2.15 కోట్లతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరగ్గా, డీబీటీ పద్ధతిలో మరో రూ.15.70 కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూరింది.

అందుబాటులో ప్రభుత్వ భవనాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు రూపుదిద్దుకున్నాయి. రూ.35 లక్షలతో రెండు అంతస్తులతో గ్రామ సచివాలయం భవనం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి రూ.17.50 లక్షలతో పాటు దాతల విరాళాలతో సరికొత్త హంగులతో సొంత భవనాన్ని నిర్మించారు. వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను రూ.17 లక్షలతో నిర్మించారు. రంగన్నగూడెం పంచాయతీ పరిధిలోని సింగన్నగూడెంలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణానికి ముఖ్యమంత్రి డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయటంతో పాటు శరవేగంగా నిర్మాణం పూర్తి చేసి, బీసీ మనోవాంఛనను నెరవేర్చారు.

సర్కారీ స్కూళ్లకు కొత్త సొగసులు

రంగన్నగూడెం, సింగన్నగూడెంలోని మండల పరిషత్ పాఠశాలలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చింది. రంగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను రూ.21 లక్షలతో, సింగన్నగూడెంలోని ఎంపీపీ స్కూల్‌ను రూ.11 లక్షలతో మన బడి నాడు–నేడు కింద మౌలిక సదుపాయాలు కల్పించారు.




రంగన్నగూడెంలోని నూతన పీఏసీఎస్ భవనం



రంగన్నగూడెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

మౌలిక సదుపాయాల మెరుగుదల

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరవల్లి నుంచి సింగన్నగూడెం వరకు రూ.1.90 కోట్లతో బీటీ రోడ్డును అభివృద్ధి చేశారు. గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. అంతేకాక మరో రూ.7 లక్షలతో ఎంపీయూపీ స్కూల్‌కు కాంపౌండ్ వాల్‌ను నిర్మించారు. సింగన్నగూడెంలో రూ.2 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. రంగన్నగూడెం పీఏసీఎస్ పరిధిలోని కోడూరుపాడు గ్రామంలో రూ.40 లక్షలతో బహుళ ప్రయోజన సౌకర్య గోడౌన్‌ను నిర్మించారు. 117 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లే అవుట్‌లో రూ.6 లక్షలతో మట్టి లెవలింగ్, అంతర్గత రోడ్లు నిర్మించారు. కానీ ఆ తర్వాత టీడీపీ నాయకులు దురుద్దేశంతో న్యాయస్థానం నుంచి స్టే తీసుకు రావటంతో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ నిల్చిపోయింది. గ్రామ సచివాలయం వద్ద రూ.3 లక్షలతో స్వచ్ఛభారత్‌లో భాగంగా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించారు. ఇవి కాక గ్రామంలోని పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఏడాది డీబీటీ పద్ధతిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.15.70 కోట్ల లబ్ధి పొందగా, నాన్ డీబీటీ పద్ధతిలో రూ.4.45 కోట్ల మేర లబ్ధి చేకూరింది.



అన్నదాతలకు అండగా..

గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రంగన్నగూడెంలో రైతులకు అండగా నిల్చింది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతగానో ఉపయోగపడే రంగన్నగూడెం నుంచి ఆగిరిపల్లి మండలం రాజగోపాలపురం రోడ్డును 2.5 కిలోమీటర్లు మేర మండల పరిషత్, రైతుల విరాళాలు కలిపి రూ.5 లక్షలతో ఏర్పాటు చేశారు. వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా తొమ్మిది మంది రైతులకు ఉచితంగా ప్రభుత్వం వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేయగా, దాదాపు 26 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తగా ఏర్పాటు చేశారు. బోదాలగుంట చెరుకు తూమును రూ.60 వేలతో మరమ్మతులు చేశారు.

ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) లబ్ధిదారుల వివరాలు		
పథకం	లబ్ధిదారులు	జరిగిన లబ్ధి (రూ.)
వైఎస్సార్ పింఛన్ కానుక	553	5.46 కోట్లు
వైఎస్సార్ చేయూత	197	89.43 లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	58	27.30 లక్షలు
ఈబీసీ నేస్తం	72	20.10 లక్షలు
జగనన్న అమ్మ ఒడి	319	1.44 కోట్లు
జగనన్న విద్యా దీవెన	179	68.26 లక్షలు
జగనన్న వసతి దీవెన	144	22.16 లక్షలు
రైతు భరోసా	550	27.62 లక్షలు
పంటల బీమా	43	4.18 లక్షలు
సున్నా వడ్డీ పంటరుణాలు	185	4.75 లక్షలు
ఇన్‌పుట్ సబ్సిడీ	368	41.66 లక్షలు
వైఎస్సార్ ఆసరా	622	1.36 కోట్లు
డ్వాక్రా సున్నా వడ్డీ	777	16.84 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	124	49.71 లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	67	4.09 లక్షలు
వైఎస్సార్ బీమా	10	11.20 లక్షలు
వాహనమిత్ర	26	7.20 లక్షలు
చేదోడు	16	3.60 లక్షలు
కోవిడ్ సహాయం	947	9.47 లక్షలు
జగనన్న తోడు (వడ్డీ)	74	36 వేలు
గృహ నిర్మాణాలు	26	38.40 లక్షలు

జగన్ ప్రభుత్వంలోనే గ్రామాభివృద్ధి..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో రంగన్నగూడెంలో అభివృద్ధి పరుగులు తీసింది. 25 ఏళ్లుగా గ్రామంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గడిచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగాయి. సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామంలోనే ముఖ్య ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, పీఏసీఎస్ భవనం, గోడౌన్ నిర్మాణం జరిగాయి.

– కుసుకుర్తి శ్రీనివాసరావు, రంగన్నగూడెం

13న సహస్రనామ కుంకుమార్చన

రామవరప్పాడు: స్థానిక రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13న క్రోధి నామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, శ్రీ మహాలక్ష్మి యాగం, అష్టోత్తర శతకలశార్చన అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. 108 కలశాల మంత్ర జలంతో 108 దంపతులు ఈ పూజలో పాల్గొంటారన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జరిమానా

గన్నవరం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి 12వ ఏఎంఎం కోర్టు జరిమానా విధించింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా గన్నవరం ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు నేతృత్వంలో సిబ్బంది స్థానికంగా పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టగా జడ్జి ఐదుగురికి రూ.50 వేలు జరిమానా విధించారని చెప్పారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

నరసం జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలు

విజయవాడకల్చరల్: నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం(నరసం) జాతీయ స్థాయిలో ఓటరు చైతన్యం అంశంగా నిర్వహించిన కవితల పోటీ విజేతల వివరాలను సంస్థ గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, అధ్యక్షురాలు చిన్నలక్ష్మి కళావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వంజారి రోహిణి రాసిన కవిత మరువ బోకు, పాలకొల్లుకు చెందిన వై.శ్రీదేవి రచించిన ఓటరు గెలుపు, నిజామాబాద్‌కు చెందిన ఇక్కడ ఓట్లు అమ్ముడు బోవు తొలి మూడు బహుమతులు, వైకే సంధ్యాశర్మ చిత్తూరు, కె.కవిత కర్నూలు ప్రోత్సాహ బహుమతులు గెలుచుకున్నారన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పెనమలూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం 17వ వార్షిక క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వి.రత్నప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో మేలు చేస్తాయన్నారు. జాతీయ స్థాయిలో విద్యార్థులు పతకాలు సాధించటంపై అభినందనలు తెలిపారు. వివిధ క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు సీహెచ్ నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ పి.రఘు, ఏఓ ఎంవీ.సాయిబాబు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



కంకిపాడు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా కోరారు. హైదరాబాద్‌కు చెందిన షేక్ మస్తాన్ షరీఫ్ కుమారుడు షేక్ ఫిరోజ్ వితరణతో ఈడుపుగల్లు గ్రామంలోని 50 మంది పేద ముస్లింలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. చిన్నా మాట్లాడుతూ 20 ఏళ్లుగా పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా వితరణ అందిస్తూ దాతృత్వాన్ని చాటుతున్నారని అభినందించారు. కార్యక్రమంలో షేక్ లాల అహ్మద్, షేక్ బాజీబీ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు గుర్తింపు



గన్నవరం: వృత్తి పట్ల అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ స్కూల్‌లో ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన దాసరి నవభారతిని సోమవారం హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎన్నార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయురాలుగా 40 ఏళ్లు అంకితభావంతో పనిచేసిన నవభారతి ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి పాటు పడ్డారని చెప్పారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వంతో పాటు పలు సంస్థలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అవార్డులను అందజేశాయన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఆమె అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ జి.జయబాబు, సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, స్పందన మానసిక వికాస కేంద్రం కార్యదర్శి రజిత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకేసారి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని తాడిగడప, పోరంకి, కానూరు, యనమలకుదురు వాసులు ఒకేసారి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తాడిగడప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏప్రిల్ 30వ తేదీలోపు ఒకేసారి చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని గృహ, ఖాళీ స్థలాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెలవు దినాల్లోనూ ప్రత్యేక కౌంటర్ల ద్వారా పన్నులు కట్టించుకుంటామని కమిషనర్ వెంకటేశ్వరరావు చెప్పారు.

నేడు పంచాంగ శ్రవణం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాపీఠం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర సందర్భంగా పంచాంగ శ్రవణం మంగళవారం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ కప్పగంతు సుబ్బరామ సోమయాజీ హాజరై పంచాంగ శ్రవణం చేస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు హాజరుకావాలని కోరారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

పెనమలూరు: గంగూరులో ఆటో డ్రైవర్‌పై పలువురు వ్యక్తులు దాడి చేసి, ఆ పైగా పోలీసు కేసు పెట్టి ఎగతాళి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంగూరులో ఉంటున్న నందిపాముల సురేష్‌బాబు(35) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న అదే గ్రామం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కోటమ్మ ఫోన్ చేసి సురేష్‌బాబును ఆటో కిరాయికి రావాలని కోరింది. దీంతో సురేష్‌బాబు ఆటోతో కోటమ్మ ఇంటికి వెళ్లాడు. సురేష్‌బాబును కోటమ్మ, కమలాకర్, సతీష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న గుమ్మడి కుమారి పట్ల తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తున్నావని సురేష్‌బాబుపై వారు దాడి చేశారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా 4వ తేదీ రాత్రి దాడి చేసిన వ్యక్తులు సురేష్‌బాబు వద్దకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఏమి చేయగలిగావని ఎగతాళి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్‌బాబు ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సురేష్‌బాబును వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళ్లి చికిత్సకై చేర్చారు. చికిత్స పొందుతున్న సురేష్‌బాబు ఆస్పత్రిలో శనివారం మృతి చెందాడు. తన కుమారుడు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి నందిపాముల మార్తమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పలు గ్రామాల్లో వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన అంబాపురం వలంటీర్లు



ఉంగుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

ఉంగుటూరు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని కొయ్యగూరపాడుకు చెందిన తలారి పవన్ సుందర్, రొక్కరొకల ప్రమోద్, జాజుల రమేష్ అనే ముగ్గురు వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో తామంతా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందిస్తే అప్పుడు వలంటీర్లు అవసరం లేదని ఏ ప్రతిపక్షాలు చెప్పలేదన్నారు. నేడు పేదవారికి పెన్షన్ ఇచ్చే విషయంలో ఆంక్షలు విధించి పేదవారిపట్ల వారికున్న చిన్న చూపును బయటపెట్టారన్నా చెప్పారు. కొందరు రాజకీయ నాయకులు తమ పట్ల అవమానకరంగా మాట్లాడటం చాలా బాధ కలిస్తోందని వాపోయారు. రాజీనామా పత్రాలను మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌కు అందజేశామని చెప్పారు. తమకు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంబాపురంలో ఏడుగురి రాజీనామా

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఏడుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. దేవరపల్లి చాందిని, నక్కనబోయిన శివకుమారి, కుండేటి రమ్య, దాసరి సోనీ, దొండపాటి షద్రక్, ఎండీ షాహీరున్నిసా, చేయబోయిన రమాదేవి, అనే వారు సచివాలయ కార్యదర్శి దేవరపల్లి శ్రీనివాసరావును కార్యాలయంలో కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. మొబైల్ ఫోన్లు, డివైజ్‌లను స్వాధీనం చేశారు.

ఎన్నికల నియమావళి సమర్థంగా అమలుకు చర్యలు



దావులూరు టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం



పోరంకిలో బస్సు తనిఖీ చేస్తున్న అధికారులు

కంకిపాడు: ఎన్నికల నియమావళి సమర్థంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పేర్కొన్నాయి. దావులూరు టోల్‌గేట్, గోసాల హెచ్‌బీ పెట్రోల్ బంకు ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించాయి. స్క్వాడ్ అధికారులు ఉదయభాస్కర్, కనకమహాలక్ష్మి నేతృత్వంలో బృందాలు వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు నియమావళిపై అవగాహన కల్పించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నగదు, ఆభరణాలు, ఎన్నికల సామగ్రి తరలింపునకు సంబంధించి పూర్తి అనుమతి పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు.

పోరంకిలో వాహనాల తనిఖీ

పెనమలూరు: ఎన్నికల సందర్భంగా పోరంకిలో ఆదివారం అర్ధరాత్రి వాహనాలను అధికారులు తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో అక్రమంగా సొమ్ము, మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకోవటానికి మండల పరిధిలో పోరంకి, కానూరు, విజయవాడ-అవనిగడ్డ కృష్ణా కరకట్ట రహదారి, గోసాల, పెనమలూరు సెంటర్లలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. ప్రత్యేక టీమ్ అధికారి కోరా శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా సొమ్ము తీసుకు వెళ్లరాదని అధికారులు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు వాహనాల తనిఖీ కొనసాగుతుందన్నారు.

సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



ఉంగుటూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు ఫలాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలో ఎలుకపాడు, వేంపాడు, తేలప్రోలు, మానికొండ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. గత ఐదేళ్ల జగనన్న పాలనలో అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. కార్యక్రమంలో తేలప్రోలులో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, ఎలుకపాడులో సర్పంచ్ పోలిమెట్ల శ్రీరామ్, ఎంపీటీసీ నటరాజన్, శివశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన టిప్పర్ : కూలీకి తీవ్ర గాయాలు

గన్నవరం: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ మహిళా తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కేసరపల్లి–సావరిగూడెం మధ్య సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం... సావరిగూడెం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం కంకిపాడు మండలం ఉప్పులూరుకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. కేసరపల్లికి మార్గమధ్యంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్, ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నేలపాల నాగేశ్వరమ్మ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికుల సమాచారం 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రురాలిని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సిద్ధిక్‌నగర్ 3వ లైన్‌లో కోమటిపల్లి మీనాక్షి భర్త శ్రీనివాసరావుతో ఉంటుంది. వీరికి వివాహమై 8 సంవత్సరాలు అయ్యింది. పిల్లలు లేరు. కాగా భర్త పెయింటర్‌గా పని చేస్తుండగా భార్య ఆటోనగర్‌లో ప్రైవేట్ కంపెనీలో పని చేస్తోంది. కాగా ఆదివారం భార్యాభర్తలు కలిసి భోజనం చేసిన తరువాత భార్య మీనాక్షి నిద్రపోయింది. ఆమె నిద్రలేచిన తరువాత చూడగా భర్త ఇంట్లో కనిపించలేదు. అతని కోసం బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితంలేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పాత ఇనుము వేలం ద్వారా రూ.17 వేల ఆదాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని శ్రీ రాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పాత ఇనుము 500 కేజీలకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.17 వేల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఈఓ మాట్లాడుతూ.. సీజీఎఫ్ పనుల్లో భాగంగా ఆలయంలో ముఖ మండపం కొట్టి వేయగా సుమారు 500 కేజీల పాత ఇనుము వచ్చిందన్నారు. దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో ఇనుము వేలం నిర్వహించగా, న్యూ ఆటోనగర్‌కు చెందిన డి.మణిబాబు రూ.17 వేలకు ఇనుము దక్కించుకున్నారని చెప్పారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వేసవి కాలం సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మే 2 తేదీ వరకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యాకన్నా మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మోహంది, హౌస్ డెకరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్స్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్ అండ్ షాంపు తయారు చేసే కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14 తేదీలోగా తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నెంబరులో కానీ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్‌తో పాటుగా ఉద్యోగులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

పెనమలూరు: పెనమలూరులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు చిన్నగుడి ప్రాంతంలో ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. ఇంట్లో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారని చెప్పారు. వారి వద్ద రూ.1,18,640 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు.